క్లుప్తంగా

వజ్రాలపురం గంగమ్మకు సారె సమర్పణ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మకు మంగళవారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సారె సమర్పించారు. కాణిపాకం వినాయక స్వామి ఆలయం తరఫున ఎమ్మెల్యే బాబు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఆలయ అర్చకులు అమ్మవారికి సారెను తీసుకువచ్చారు. వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి దర్శించుకున్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



బుడితిరెడ్డిపల్లెలో కుంటను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

యాదమరి: మండలంలోని పలు గ్రామాలలో చేసిన ఉపాధి హామీ పనులను జలశక్తి అభియాన్ బృందం (ఢిల్లీ) పరిశీలించింది. మంగళవారం బుడితిరెడ్డిపల్లెలోని అమృత్ సరోవర్ పథకం కింద చేసిన కుంట పనులు, కొనాపల్లెలో ఉపాధి పనులను పరిశీలించిన అనంతరం మస్టర్, డి-మస్టర్, మొబైల్ యాప్ నేషనల్ మస్టర్ మానిటరింగ్ యాప్‌ను ఏ విధంగా ఉపయోగిస్తున్నారో బృందం అడిగి తెలుసుకుంది. కార్యక్రమంలో జలశక్తి బృందానికి చెందిన ఎస్‌కే పట్నాయక్, సమురేంద్ర సింగ్, డీఆర్‌డీఏ పీడీ గంగాభవాని, ఎంపీడీఓ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి విరాళం


ఆలయ అధికారులకు విరాళమిస్తున్న రవిశంకర్ కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామికి మంగళవారం హైదరాబాద్‌లోని హబ్సిగూడకు చెందిన రవిశంకర్ రూ.2.50లక్షలు విరాళమిచ్చారు. గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.50లక్షలు, నిత్యాన్నదానానికి రూ.లక్ష చొప్పున ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు ఈ విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల తనిఖీ



శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న ఎస్‌ఆర్‌పి సుబ్రమణ్యం

బంగారుపాళెం: విద్యార్థులు వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఆర్‌పీ సుబ్రమణ్యం కోరారు. మండలంలోని తుంబకుప్పం జెడ్పీ హైస్కూలులో నిర్వహిస్తున్న తరల్(టీచింగ్ ఎట్ రైట్ లెవల్)కార్యక్రమంలో మంగళవారం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఈ మెటీరియల్‌తో విద్యార్థులు ఇళ్ల వద్దే బొమ్మలు గీయడం, ఆకులతో బొమ్మలను తయారు చేయడం, బొమ్మలతో సామెతలు చెప్పడం, గుణింతాలతో పదాలు సృష్టించడం, క్రమ పద్ధతిలో పదాలు వచ్చేలా అక్షరాలు అమర్చడం, ఫన్ క్యాలెండర్ తయారు చేయడం వంటివాటిని సులభంగా నేర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. తరల్ శిక్షణ తరగతులను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన

చిత్తూరు అర్బన్: టిడ్కో గృహ సముదాయాల పరిధిలో మౌలిక సదుపాయాలు వేగంగా కల్పించాలని నగర కమిషనర్ డాక్టర్ జె అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం రాత్రి కమిషనర్, పూనేపల్లె వద్దనున్న టిడ్కో గృహ సముదాయాల వద్ద నీటి సరఫరా, ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. శానిటేషన్ పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ వెంకటముని, సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీలు తగ్గించాలి

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయం ఎదుట మంగళవారం టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. కరెంటు చార్జీలను తగ్గించాలని, వ్యవసాయ సర్వీసులకు మీటర్లు, నివాసాలకు స్మార్ట్ మీటర్లు బిగించరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొరబాబు, హేమలత, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగజాతర

- పలుచోట్ల కొలువుదీరిన గంగమ్మ
- అమ్మవారికి విశేష పూజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


సాంబయ్యకండ్రిగ జాతరలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరులో మంగళవారం గంగ జాతర భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. నగరంలోని మురుగానంపల్లె, కట్టమంచి, సాంబయ్యకండ్రిగ, మూడవగేటు, వరదరాజులమిట్ట, ఇరువారం, మండలంలో గువ్వకల్లు, తాళంబేడు, జంభూగోళంపల్లె తదితర గ్రామాల్లో జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లారేసరికి తెర తొలగించి విశేష పూజలు చేశారు. ఆ తర్వాత గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి గజమాల సమర్పించారు. మహిళలు అమ్మవారి మండపం చుట్టూ ప్రదక్షిణలు చేసి అంబలి పోశారు. అలాగే పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. రాత్రి కుంభ నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీధినాటక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సాంబయ్యకండ్రిగలో ఎమ్మెల్యే, ఆర్టీసీ వైస్ చైర్మన్

సాంబయ్యకండ్రిగ గంగజాతరకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరై అమ్మవారిని కర్పూర హారతులతో దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆయనను సన్మానించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హరిణిరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఇరువారంలో కొలువుదీరిన గంగమ్మకు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి గజమాల సమర్పించారు. మంగళ హారతి ఇచ్చారు. జాతర పెద్దలు ఆయనను సన్మానించారు.


ఇరువారం గంగజాతరలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి


గువ్వకల్లులో పూజలందుకుంటున్న అమ్మవారు

బాటగంగమ్మ పొంగళ్లు

పూతలపట్టు: పూతలపట్టు మండలం తేనేపల్లె పంచాయతీలోని బాటగంగమ్మకు మంగళవారం మండల ప్రజలు ఉదయం అంబలి పోసి, పొంగళ్లు పెట్టి, మొక్కులు చెల్లించారు. పెద్దఎత్తున పూజల్లో మండల ప్రజలు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

ఆర్‌బీకేలకు చేరిన వేరుశనగ విత్తనాలు

తవణంపల్లె: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడానికి అవసరమైన వేరుశనగ విత్తనాలు ఆర్బీకేలకు సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ చెప్పారు. మండలానికి 1600 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరమని జిల్లా అధికారులకు ఆయన ఇండెంట్ పెట్టారు. ఈ నేపథ్యంలో మండలంలోని పుణ్యసముద్రం, చెర్లోపల్లె, పట్నం, నలిశెట్టిపల్లె, ఎగువ తవణంపల్లె, గోవిందరెడ్డిపల్లె, సరకల్లు, వెంగంపల్లె ఆర్‌బీకేలకు 813 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు సరఫరా చేశారు. మిగిలిన ఆర్‌బీకేలకు సరఫరా చేసిన తర్వాత రైతులకు వీటిని పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. విత్తనాలను పరిశీలించి మొలక శాతాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. 30 కిలోల బస్తా రూ. 2790 కాగా ప్రభుత్వం సబ్సిడీపై రూ.1674 ఇస్తోందని చెప్పారు. విత్తనాలు మంచి రకం సరఫరా కావడంతో రైతులు, రైతు సంఘాలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.


గాజులపల్లెలో వేరుశనగ విత్తనాలను పరిశీలిస్తున్న రైతులు, వ్యవసాయాధికారులు

నేడు వేరుశనగ విత్తనాల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తాళంబేడులో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా వేరుశనగ కాయలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్ తెలిపారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

పూతలపట్టు: విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లావణ్య కోరారు. మంగళవారం మండలంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. వేసవి సెలవులలో సమయాన్ని వృథా చేయకుండా శిబిరంలో కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. విద్యార్థులను అడిగిన ప్రశ్నలకు వారు సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు పాల్గొన్నారు.

31న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి):కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకలను ఈనెల 31న బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఆలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. మంగళవారం కమిషనర్ గిరింపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. డాక్యుమెంటేషన్, రిజిస్ట్రేషన్ చేస్తున్న తీరుపై రిజిస్ట్రేషన్ అధికారులు, లబ్ధిదారులతో చర్చించారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చే ప్రక్రియ తప్పులు లేకుండా, వేగంగా పూర్తి చేయాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని పూనేపల్లెలో ఉన్న టిడ్కో గృహాలకు సంబంధించి 365 చదరపు అడుగుల గృహాలకు 87మందికి, 430 చదరపు అడుగుల గృహాలకు సంబంధించి 181 మందికి బ్యాంకుల నుంచి 90శాతం రుణాలు అందాయన్నారు. రుణాల మంజూరు ప్రక్రియ పూర్తి కావడంతో సదరు లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. మంగళవారం 25 మందికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన లబ్ధిదారులకు సంబంధించిన గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయించాలని, లబ్ధిదారులను సమన్వయం చేసుకోవాలని మెప్మా, వార్డు సంక్షేమ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ రహమ్మతుల్లా, ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి, టిడ్కో ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు ఇస్తున్న కమిషనర్ అరుణ

పక్కాగా వసతి గృహానికి మరమ్మతులు

–నగర్ కమిషనర్ ఆదేశం

చిత్తూరు అర్బన్: సంతపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో మరమ్మత్తులు పక్కాగా చేయాలని నగర కమిషనర్ జె.అరుణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె సంతపేటలో బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. వసతి గృహంలో ఫ్లోరింగ్, సీలింగ్ రిపేర్లపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. మరుగుదొడ్లను బాగు చేయాలని, ఎలక్ట్రికల్, పెయింటింగ్ పనులకు సంబంధించి అంచనాలు రూపొందించి స్కూళ్లు పునఃప్రారంభం లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వసతి గృహం వద్ద మొక్కలు పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ ధనలక్ష్మి, డీఈ వెంకట ప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

పుస్తకాలతో స్నేహం చేయాలి

పలమనేరు: నేటి విద్యార్థులు పుస్తకాలతో స్నేహం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మరో గ్రంథాలయం బైక్ ర్యాలీ ఉద్యమాన్ని చేస్తున్న మంచికుంటి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. తన ఉద్యమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితీ కార్యాలయానికి ఆయన విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచి పుస్తక పఠనంపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్య క్రమంలో నిర్వాహకులు తులసీనాథంనాయుడు, పుష్ప, శ్రీరామచంద్రమూర్తి గ్రంథాలయ ఆవశ్యకతను తెలిపే కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యాదమరి:మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇక్కడ 1991–1992లో పదవ తరగతి చదివిన వారంతా కలిసి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులు చంద్రశేఖర్ రెడ్డి, మల్లిక బేగం, రఘునాథ రెడ్డి, మదన్‌మోహన్‌ను సన్మానించి ఆశీస్సులు పొందారు. సహచర విద్యార్థుల్లో ఎవరైనా కుటుంబ పరంగా ఇబ్బందులు పడుతున్న పక్షంలో స్నేహం కొద్దీ తమ వంతుగా ఆదుకోవాలని గురువులు సూచించారు.

హంస వాహనంపై ఇంద్రవరదుడు


హంస వాహనంలో స్వామివారు

యాదమరి: స్థానిక త్రివేణి సంగమంలో నిర్వహిస్తున్న ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలలో మంగళవారం స్వామివారు హంస వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక పూజార్చనలు, అభిషేకాలు, అలంకరణల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికలో కొలువుదీర్చి, పూజలు చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు గ్రామస్తులు మజ్జిగ పంపిణీ చేశారు.

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన భక్తుడు

బంగారుపాళ్యం మండలం చిలగుండ్లపల్లెకు చెందిన యోగానంద రెడ్డి కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ అర్చకులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సంకరజాతి పేయదూడలు పెంచుకోవాలి

యాదమరి:పాడి రైతులు సంకరజాతి పేయదూడలను పెంచుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు ప్రభాకర్ కోరారు. మంగళవారం మండలంలోని ముద్దురామాపురంలో సంకరజాతి పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. వాటిని జిల్లా పశుసంవర్థక శాఖ సంచాలకులు, ఉప సంచాలకులు పద్మావతి తదితరులు పరిశీలించారు. మొత్తం 56 దూడలను పాడి రైతులు ప్రదర్శించారు. వాటిలో మూడు సంకరజాతి, 3 జెర్సీ దూడలను ఎంపిక చేసి సంబంధిత పాడిరైతులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సంచాలకులు మాట్లాడారు. అలాగే పేయదూడలలో నట్టల నివారణ, సరైన సమయంలో టీకాలు వేయించడం, వైఎస్సార్ పశు బీమా రాయితీ కింద విత్తనాల పంపిణీ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో యాదమరి మండల పశువైద్యాధికారి అమరనాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరనారాయణ రెడ్డి, సర్పంచ్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.


పేయ దూడల రైతులకు బహుమతులు అందజేస్తున్న పశు వైద్యాధికారులు

పేదలకు సీఎం కొండంత అండ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా ఉంటున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని వావిల్‌తోట పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాల్లోని వ్యక్తులు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. పార్టీ, కులమతాలకతీతంగా అర్హులందరికీ తమ ప్రభుత్వం పథకాల ఫలాలను దరి చేరుస్తోందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధితో మహిళ లు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అందుబాటులో ఉంటున్న సచివాలయ సిబ్బందితో సమస్యలను పరిష్కరించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. మూతిగానివూరులో గ్రామస్తులు తాగునీరు, దారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నం రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు జయచంద్రారెడ్డి, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్ఐ హరిప్రసాద్, ప్రజాప్రతినిధులు, దళిత నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పేట అగ్రహారంలో..

బుధవారం ఉదయం 7 గంటల నుంచి పేట అగ్రహారం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇళ్ల ముంగిటకే వైద్యం


బంగారుపాళెం: ఎగువ బందార్లపల్లెలో..


గుడిపాల: రాసనపల్లెలో..

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామాల్లో ఇళ్ల ముంగిటే వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమని, ఈ దిశగా గ్రామీణుల కు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎగువ మత్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 మొబైల్ వాహనంలో 75 మంది గర్భవతులు, మధుమేహ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బెస్తపల్లెలో..

ఐరాల: మండలంలోని బెస్తపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యసేవలందించారు. పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బంగారుపాళెం మండలంలో..

బంగారుపాళెం: మండలంలోని మడుపోలూరు, ఎగువబందార్లపల్లె గ్రామాల్లో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ గర్భవతులు, బాలింతలు, షుగర్ వ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆ తర్వాత రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. ఆరోగ్య, 104 సిబ్బంది పాల్గొన్నారు.

రాసనపల్లెలో..

గుడిపాల: రాసనపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని 104 వైద్యాధికారి పవన్ నిర్వహించారు. పలువురినీ పరీక్షించి అవసరమైన వారికి మందులను అందజేశారు. సిబ్బంది అన్నపూర్ణ, ఉమామహేశ్వరి, మల్లిక పాల్గొన్నారు.

తప్పిదాలు చేస్తే ఉపేక్షించం

- ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్: 'రోగులకు అవసరమైన టెస్టులు ల్యాబ్‌లో చేయకుండా బయట చేయించుకోవాలని ఎలా రాస్తారు...? ఇక మీదుట తప్పిదాలు చేస్తే ఉపేక్షించేది లేదు' జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ మండిపడ్డారు. సాక్షి దినపత్రికలో సోమవారం 'ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రైవేటు దందా' శీర్షికన ప్రచురించిన కథనంపై సూపరింటెండెంట్ స్పందించారు. మంగళవారం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తన కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్, డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. పైవిధంగా హెచ్చరించారు. రాత్రి పూట ల్యాబ్ టెస్టులు రాయకూడదని, ఉదయం పూట వెళ్లే రౌండ్స్‌లోనే రోగులను పరీక్షించి అవసరమైతేనే టెస్టులకు రాయాలన్నారు. ముఖ్యంగా పీజీ డాక్టర్లు టెస్టు రాసేటప్పుడు కచ్చితంగా హెచ్‌ఓడీ సలహా తీసుకోవాలని ఆదేశించారు. ఒక వేళ బయట టెస్టులు చేయాల్సివస్తే తమ దృష్టికి తేవాలన్నారు. అలాంటి వారికి బయట ఉచితంగానే చేయిస్తామని చెప్పారు. బయట వ్యక్తులను పిలిచి ఇక్కడ టెస్టులు చేయిస్తే తర్వాత జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇక ల్యాబ్‌లో సేకరించిన ప్రతి శాంపిల్స్‌కు పక్కా రిపోర్ట్ ఇవ్వాలన్నారు. ల్యాబ్ విషయంలో ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంతకు ముందు ఇదే విషయమై డీసీహెచ్ బీఎస్‌కే నాయక్ ఆస్పత్రి అధికారులతో మాట్లాడారు. ల్యాబ్ టెస్టులు నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.


ల్యాబ్ సిబ్బంది, నర్సింగ్ బృందంతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్

వజ్రాలపురం బోయకొండ గంగమ్మకు పూజలు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం మంగళవారం భక్తులతో పోటెత్తింది. అమ్మవారి 24వ వార్షిక జాతరలో రెండోరోజు అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అంబలి, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. . పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. బెంగళూరుకు చెందిన దీప, గోపి లక్ష్మి, రమణబాబు, మమతశ్రీ, ఈశ్వర్‌నాయుడు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే బంగారుపాళెంలో గంగ జాతర ఘనంగా ప్రారంభమైంది. గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి శిరస్సును పురవీధుల్లో ఊరేగించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సోమవారం రాత్రి జబర్దస్త్ ఆర్టిస్టులు వినోద్, గెడ్డం నవీన్, అప్పారావు కామెడీ షో, పాల్‌రాజ్ బృందం డ్యాన్స్ ప్రదర్శన అలరించాయి. సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ విద్యుత్ ఉద్యోగి మృతి

- కొడుకు బతకడన్న ఆందోళనతో వారం క్రితమే తల్లి ఆత్మహత్య


తల్లి సరోజమ్మతో పవన్‌కుమార్ (ఫైల్)

యాదమరి: విద్యుత్‌షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ట్రాన్స్‌కో శాఖ జేఎల్‌ఎం–2 పవన్ కుమార్(25) మంగళవారం మృతి చెందాడు. ఈ నెల 8న సోమవారం జోడిచింతల వద్ద విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా రిటర్న్ సప్లై రావడంతో పూర్తిగా కాలిపోయాడు. చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సీఎంసీకి, మళ్లీ అక్కడి నుంచి తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. అయితే ఇతను గతంలో కూడా మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అయి కాలిపోయాడు. ఇటీవలే కోలుకుని విధులకు వెళ్తున్నాడు. ఆ శాఖ అధికారులు అతనికి మెరుగైన చికిత్స అందించలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వారం కిందటే పవన్ తల్లి సరోజమ్మ ఆస్పత్రికి వెళ్లి పవన్ పరిస్థితిని చూసి తట్టుకోలేకపోయింది. కొడుకు చనిపోతే తనకు దిక్కెవరని ఈ నెల 15న ఆమె స్వగ్రామం గంగాధర నెల్లూరు గడ్డంపల్లెలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.